సిద్దిపేట క్రైం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తల్లితో కలిసి రాఖీ కట్టేందుకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృత్యువాత పడింది. వారు ప్రయాణిస్తున్న కారు టైరు పగలడం.. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి పల్లవి కుటుంబం గజ్వేల్‌లో స్థిరపడింది. శనివారం సిద్దిపేటలో ఉంటున్న తన తమ్ముడికి రాఖీ కట్టేందుకు కుమార్తె శృతి(25)తో కలిసి వచ్చింది. సిద్దిపేటలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నాగిళ్ల శ్రీనివాస్ ఇంటికి వారు రాగా, నాగిళ్ల శ్రీనివాస్ భార్యను, అక్కా పల్లవి, కోడలు శృతిని తీసుకుని టీఎస్ 09 ఎస్ఏ 8304 నెంబర్ కారులో అత్తాగారి ఊరైన అల్లిపూర్‌కు వెళ్లారు. అక్కడ భార్యను వదిలి ముగ్గురు కలిసి నాగిళ్ల శ్రీనివాస్ స్వగ్రామమైన నర్మెటకు రాఖీ కట్టేందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో నర్సాపూర్ చౌరస్తా కారు టైరు పగిలిపోయింది. కారు నెమ్మదించిన నేపథ్యంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కరీంనగర్ -1 డిపోకు చెందిన టీజీ 02 0023 నెంబర్ గల ఆర్టీసీ రాజధాని ఎక్స్‌ప్రెస్ కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో వెనుక కూర్చున్న శృతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. టూ టౌన్ పోలీసులు వెంటనే వచ్చి గాయపడిన శృతిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె మృతి చెందింది. ప్రమాదంలో పల్లవికి స్వల్ప గాయాలు అయ్యాయి. శృతి బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగం చేస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శృతి(ఫైల్)

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

ములుగు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : బైక్ పైనుంచి పడి మహిళ మృతిచెందిన సంఘటన ములుగు మండలం తునికిబొల్లారం గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బక్క భారతి(40) లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రిలో హౌస్‌కీపర్‌గా పనిచేస్తుంది. శుక్రవారం రాత్రి పని ముగించుకుని కుమారుడి బైక్‌పై వస్తున్నది. గ్రామ సమీపంలోకి రాగానే తల తిరిగి బైక్ పైనుంచి కిందపడింది. తలకు బలమైన గాయం కావడంతో కుటుంబసభ్యులు వెంటనే ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతిచెందింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

భూ తగాదాలతో వ్యక్తి ఆత్మహత్య


మల్లేషం(ఫైల్)

రాయపోల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు చేసిన భూమిని అమ్మిన వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయపోల్ మండలం మంతూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెలిమెల మల్లేశం(49) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన రిమ్మనగూడ బొందవ్వ వద్ద 2 ఎకరాల 12 గుంటల భూమిని కొనుగోలు చేశాడు. భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడినప్పటికీ బొందవ్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయలేదు. తమకు భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా కొందరు అడ్డుపడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మల్లేశం శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య చెలిమెల లక్ష్మి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మానస తెలిపారు.

పండుగ పూట విషాదం

● గుండెపోటుతో యువకుడి మృతి

నారాయణఖేడ్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవన్‌రావుపేటలో శనివారం రాఖీ పండుగ పూట విషాదం నెలకొంది. గుండెపోటుతో ఓ యువకుడు మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంబరి రవి(34) శనివారం ఉదయం తన నివాసంలో అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలాడు. కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం ఖేడ్ ఏరియా వైద్యశాలకు తీసుకురాగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడికి భార్య ఉమ, మూడేళ్లలోపు కుమారుడు, కూతురు ఉన్నారు. రవి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.


ఎంబరి రవి(ఫైల్)

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

● చిట్కుల్ గ్రామంలో ఘటన

చిలప్‌చెడ్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన చిలప్‌చెడ్ మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన బోయిని కిష్టయ్య(65) శుక్రవారం ఉదయం పత్తి పంటకు మందు పిచికారీ చేశాడు. అనంతరం అదే గ్రామానికి చెందిన చెర్ల కిష్టయ్యతో కలిసి గ్రామంలో మద్యం సేవించాడు. చెర్ల కిష్టయ్య బోయిని కిష్టయ్యను మధ్యాహ్నం 1 గంట సమయంలో గ్రామంలోని ఉన్నత పాఠశాల ముందు గల కల్వర్టుపై దించి వెళ్లాడు. ఆ వైపుగా వస్తున్న బోయిని నాగరాజు గమనించగా.. బోయిని కిష్టయ్య గాఢ నిద్రలో ఉన్నాడు. సాయంత్రం 4 గంటలకు కిష్టయ్య కుమారుడు మల్లేశం వెళ్లి చూడగా.. మృతిచెంది ఉన్నాడు. తన భర్త మృతిపై అనుమానం ఉన్నదని, విచారణ జరపాలని భార్య లచ్చమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వినాయక చవితికి విగ్రహాలు సిద్ధం

● ఆధునిక డిజైన్లతో ఆకట్టుకునే విధంగా..
● 12 అడుగుల వరకు విగ్రహాలు అందుబాటులో..

నారాయణఖేడ్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పర్వదినం సమీపిస్తుండడంతో విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా ఆధునిక డైజన్లతో ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దుతున్నారు. 12 అడుగుల వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతంలో హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల నుంచి విగ్రహాలను తెచ్చుకునే వారు. ప్రస్తుతం పోటీపడి విగ్రహాలను ఏర్పాటు చేస్తుండడంతో 6, 7 ఏళ్లుగా రాజస్థాన్ కళాకారులతో కొందరు తయారు చేయించి విక్రయిస్తుండగా, మరికొందరు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి ఇక్కడికి తెచ్చి విక్రయిస్తున్నారు.

ఖేడ్‌లో 30 దుకాణాలు

ప్రస్తుతం నారాయణఖేడ్‌లో 30 వరకు విగ్రహాల దుకాణాలు వెలిశాయి. దాదాపు రెండు ఫీట్ల నుంచి 12 ఫీట్ల ఎత్తుగల విగ్రహాలు వివిధ రకాల భంగిమలలో సిద్ధంగా ఉన్నాయి. విగ్రహం డిజైన్‌ను బట్టి రూ.2 వేల నుంచి రూ.30 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే నిర్వాహకులు తమకు అవసరమైన విగ్రహాలను విక్రయదారుల వద్ద ఎంపిక చేసుకొని అడ్వాన్సులు ఇచ్చి వెళ్తున్నారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో దాదాపు 1000 వరకు మండపాలు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఫాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల పర్యావరణ సమస్య తలెత్తుతుందని భావించేవారు మట్టి గణపతులను కూడా ప్రతిష్ఠించుకునే విధంగా వాటిని కూడా ప్రత్యేకంగా విక్రయిస్తున్నారు. మట్టి వినాయకులు స్థానికంగా 2 నుంచి 4 అడుగుల వరకు లభిస్తున్నాయి. ఈ విగ్రహాలు రూ.4 వేల నుంచి రూ.12 వేల వరకు విక్రయిస్తున్నారు. ప్రత్యేకంగా కోల్‌కత్తా మోడల్‌లో మట్టి వినాయకులను స్థానికంగానే తయారు చేస్తున్నారు. ఏదేమైనా వినాయక చవితి సమీపిస్తుండడంతో విగ్రహాల విక్రయాల దుకాణాల వద్ద సందడి నెలకొంది.



ఖేడ్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఫాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు, వినూత్నంగా శివలింగాన్ని కౌగిలించుకుంటున్న మట్టి వినాయకుడు

మహారాష్ట్ర నుంచి విగ్రహాలు తీసుకొచ్చాం

తాము మహారాష్ట్ర నుంచి విగ్రహాలను విక్రయానికి తీసుకొచ్చాం. మా వద్ద 4 నుంచి 10 ఫీట్ల వరకు వంద విగ్రహాలను సిద్ధం చేసి ఉంచాం. గతంలో నిర్వాహకులు విగ్రహాలను ఇతర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసాలకు ఓర్చి తెచ్చుకునేవారు. తాము స్థానికంగా అందుబాటులోఉంచడంతో ఉత్సవ నిర్వాహకులకు ఇబ్బంది లేకుండా ఉంది.

- రాంబాబు, విక్రయదారుడు

పరిశ్రమలో గోడ కూలి ఒకరు మృతి

● మరొకరికి గాయాలు.. కంపెనీ నిర్లక్ష్యం వల్లేనని ఆందోళన
● రాఖీ పండుగ రోజు విషాదం

మనోహరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో పని చేస్తుండగా గోడ కూలి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పారిశ్రామిక వాడలో చోటు చేసుకుంది. రాఖీ పండుగ రోజు విషాదం నింపిన ఈ ఘటన సంబంధిన వివరాలు ఇలా ఉన్నాయి. కాళ్లకల్ పారిశ్రామికవాడలోని రామ స్పిన్నింగ్ మిల్లు ప్రైవేట్ లిమిటెడ్‌లో మనోహరాబాద్‌కు చెందిన తమ్మరెడ్డి బాల్‌రెడ్డి(56), కాళ్లకల్ గ్రామానికి చెందిన గానుగు రవి(43)లు ఎలక్ట్రిషియన్లుగా పని చేస్తున్నారు. ఇద్దరూ శనివారం పరిశ్రమలో వాటర్ ట్యాంక్ వద్ద ట్యాంకు నింపుతుండగా, ఒక్కసారిగా గోడ కూలి బాల్‌రెడ్డిపై పడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పక్కనే ఉన్న గానుగు రవిపై కూడా గోడ పడటంతో కాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో ఆయనను పరిశ్రమ సిబ్బంది నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. బాల్‌రెడ్డి ఈ కంపెనీలో 26 సంవత్సరాల నుంచి ఎలక్ట్రిషియన్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడు సందీప్‌రెడ్డి అమెరికాలో ఉన్నాడు. కంపెనీలో ప్రమాదం జరిగిందన్న సమాచారం అందిన వెంటనే బాల్‌రెడ్డి బంధువులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. కంపెనీ నిర్లక్ష్యం వల్లే బాల్‌రెడ్డి చనిపోయాడని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేసేవరకు మృతదేహాన్ని తరలించేది లేదని భీష్మించుకూర్చున్నారు. మనోహరాబాద్, తూప్రాన్ ఎస్సైలు శివనందం, సుభాష్‌గౌడ్, తూప్రాన్ డివిజన్ బెటాలియన్ పోలీసులు వచ్చి బందోబస్తు నిర్వహించారు. కంపెనీ బాధ్యులు వచ్చి న్యాయం చేసే వరకు కదిలేది లేదని సాయంత్రం వరకు అక్కడే కూర్చున్నారు. పోలీసులు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నించగా, వాగ్వాదానికి దిగారు.


బాల్‌రెడ్డి (ఫైల్)


సంఘటనా స్థలం వద్ద బైఠాయించిన గ్రామస్థులు, కుటుంబీకులు

మహిళను చెట్టుకు కట్టేసి.. కొట్టి..

● దంపతుల దాష్టికం

మర్కుక్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై వెళ్తున్న మహిళ తమను దూషించిందంటూ ఆమెను చెట్టుకు కట్టేసి సుమారు అర గంట పాటు కొట్టారు. ఈ ఘటన జరుగుతున్న సమయంలో గ్రామస్థులు చూస్తూ నిలబడ్డారే తప్ప ఆమెను విడిపించే ప్రయత్నం చేయలేదు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొమ్మని లక్ష్మి దళితురాలు. భర్త, పిల్లలు లేరు. ఒంటరిగా ఉండే ఆమె శనివారం రోడ్డుమీదుగా దూషించుకుంటూ వెళ్తోంది. తమనే దూషిస్తోందని గ్రామానికి చెందిన సత్యనారాయణ, రేణుక అనే దంపతులు బొమ్మని లక్ష్మిని పట్టుకుని చెట్టుకు కట్టేసి కొట్టారు. తాగిన మైకంలో ఆమె తమనే దూషించిందని వారు ఆరోపిస్తూ.. ఎందుకు దూషిస్తున్నావంటూ కొట్టారు. గ్రామంలో దుర్గమ్మ ఆలయ నిత్య పూజారులైన ఈ దంపతులు ఆమెను కొడుతుండగా, అక్కడికి వచ్చిన గ్రామస్థులు చూస్తూ ఉన్నారే తప్ప విడిపించే ప్రయత్నం చేయలేదు. విషయం తెలిసి గ్రామంలోనే ఉన్న లక్ష్మి సోదరుడు హుటాహుటిన వచ్చి ఆమెను విడిపించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దళిత మహిళను చెట్టుకు కట్టేసి కొట్టిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, బాధితురాలికి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


మహిళను చెట్టుకు కట్టేస్తున్న దృశ్యం

తోటపల్లిలో శతాధిక వృద్ధురాలు మృతి

హుస్నాబాద్‌రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామానికి చెందిన గాజుల వరవ్వ(104) శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. వరవ్వకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. తోటపల్లిలో గ్రామస్థులు, కుటుంబసభ్యులు శతాధిక వృద్ధురాలి అంత్యక్రియలు ఘనంగా జరిపించారు.


గాజుల వరవ్వ (ఫైల్)

మల్లికార్జున్‌పల్లిలోకి అడవి పంది హల్‌చల్

● వలేసి పట్టుకున్న గ్రామస్థులు
● ఊపిరి పీల్చుకున్న ప్రజలు


అడవి పందిని పట్టుకున్న పొండు

మునిపల్లి, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లికార్జున్‌పల్లి గ్రామంలో కొన్ని రోజులుగా అడవి పందులు హల్‌చల్ చేస్తున్నాయి. శనివారం గ్రామంలో గల కొత్త కాలనీలో ఊరిలో ఉండే పందులతో కలిసి హాయిగా పడుకున్నది. దీన్ని గమనించిన గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఎలాగైనా పట్టించాలని గ్రామానికి చెందిన పిచ్చకుంట్ల పొండుకు చెప్పారు. అతడు తన వద్ద ఉన్న వలను కట్టి అడవి పందిని పట్టుకున్నాడు. దీంతో గ్రామస్థులంతా ఊపిరి పీల్చుకున్నారు.

పెళ్లిలో రాఖీ కౌంటర్


పెళ్లిలో రాఖీల సౌకర్యం

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం తెల్లాపూర్‌లో శనివారం జరిగిన ఓ పెళ్లి ప్రత్యేకంగా రాఖీ కౌంటర్ ఏర్పాటు చేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పెళ్లికి వచ్చే బంధువులు రాఖీలు కట్టడానికి వీలుగా రాఖీలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్ ఆకర్షణగా నిలిచింది.

ప్రకృతిని ప్రేమిద్దాం

● మొదలైన ఎన్ఎస్‌పీఎస్ 2025 రిజిస్ట్రేషన్లు
● ఈకో మిత్రం ఆప్ ద్వారా ఆగస్టు 21 వరకు నమోదుకు అవకాశం
● పాల్గొననున్న లక్షలాదిగా నేచర్ లవర్స్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : 'ఈ ప్రకృతిలో ఏదీ మనం సొంతం కాదు. మనం భూమి మీద టెన్నెంట్స్ మాత్రమే. కొన్నాళ్లు ఉండటానికి వచ్చాం. అలాగే ఉండి ఏది డిస్టర్బ్ చేయకుండా వెళ్లిపోదాం. తర్వాత తరానికి ఉన్నది ఉన్నట్లుగా ఇచ్చేయాలి.' ఇది ఓ తెలుగు సినిమాలో డైలాగ్. ప్రస్తుతం ప్రకృతి విధ్వంసం చూస్తే.. ఆ మూవీ డైలాగ్‌ను తూచ తప్పకుండా పాటించాల్సిందేనని అనిపిస్తున్నది. దాదాపు 200 ఏళ్లలో జరిగిన ప్రకృతి విధ్వంసం కొన్ని మిలియన్ సంవత్సరాల్లో ఎప్పుడూ జరగలేదంటున్నారు పర్యావరణ ప్రేమికులు. విరివిగా ప్లాస్టిక్ వాడటం, డిస్పోజబుల్స్, శిలాజ ఇంధనాలను వాడటం, పొల్యూషన్, అడవులను నరికివేయటం వంటి మానవ తప్పిదాల వల్ల ప్రకృతికి పూడ్చలేని లోటును ఎదుర్కొనబోతుందంటున్నారు.

ఎన్ఎస్‌పీఎస్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్

వాతావరణ మార్పుల పర్యవసానాల నుంచి రక్షణకు విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవటం, మొక్కలు నాటడం, నీటి సంరక్షణ, వ్యర్థాలను వేరుచేయటం వంటి అంశాల్లో అవగాహన అవసరం. విద్యార్థి దశ నుంచే వీటిపై అవేర్‌నెస్ పెంచాలనే ఉద్దేశంతో 'హరిత్ ద వే ఆఫ్ లైఫ్' అనే థీమ్‌తో దేశవ్యాప్తంగా ఎన్ఎస్‌పీఎస్ 2025 (నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ కాంపిటీషన్)ను కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహకారంతో పర్యావరణ గతివిధి (పీఎస్‌జీ) నిర్వహిస్తుంది. జూలై 1 నుంచి ఆగస్టు 21 వరకు ఆసక్తి ఉన్నవారు రిజిస్ట్రేషన్లు చేసుకోని ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనాలి. ఈ ఫలితాలు ఆగస్టు 31 ప్రకటిస్తారు. ఈకో మిత్రం అనే మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. హిందీ, ఇంగ్లీష్ సహా పలు భాషల్లో క్విజ్‌లో పాల్గొనవచ్చు. మొక్క నాటుతున్న, నీరు సేవ్ చేస్తున్న లేదా వ్యర్థాలను వేరు చేస్తున్న సెల్ఫీని తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పాల్గొన్న ప్రతీ విద్యార్థికి ఈ సర్టిఫికెట్ అందజేస్తారు.


ఎన్ఎస్‌పీఎస్ 2025 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హైమావతి, జిల్లా విద్యాశాఖ అధికారులు(ఫైల్)

ఐదు విభాగాల్లో పోటీ

ఈ క్విజ్ పోటీలో మొదటి విభాగంలో 1 నుంచి 5వ తరగతి, రెండో విభాగంలో 6 నుంచి 8వ తరగతి, మూడో విభాగంలో 9 నుంచి 12వ తరగతి, నాల్గవ విభాగంలో డిగ్రీ, పీజీ, పరిశోధన విద్యార్థులు, ఐదో విభాగంలో ఇతరులు సాధారణ పౌరులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొనవచ్చు. దేశవ్యాప్తంగా నాలుగేళ్లుగా లక్షలాది మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. జిల్లా నుంచి ఈసారి పెద్దఎత్తున పాల్గొనేలా విద్యాశాఖ అధికారులు అవేర్‌నెస్ కార్యక్రమాలు చేపడుతున్నారు. తాజాగా ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ హైమావతి ఆవిష్కరించారు.


సదాశివపేటలోని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నివాసంలో రాఖీ కడుతున్న కుటుంబ సభ్యులు


రామచంద్రాపురం ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ శ్రీనివాస్‌కుమార్‌కు రాఖీ కడుతున్న మహిళా పోలీసులు


పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి నర్సమ్మ


పటాన్‌చెరు పట్టణంలో రాఖీపౌర్ణమి జరుపుకున్న కుటుంబసభ్యులు


నారాయణఖేడ్‌లో తమ్ముడికి రాఖీ కడుతున్న అక్కలు

వెల్లివిరిసిన ఆత్మీయబంధం

● మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో రక్షాబంధన్ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇంటింటా పండగ వాతావరణం నెలకొన్నది. ఈ సందర్భంగా అక్కా చెల్లెళ్లు తమ అన్నదమ్ములకు దీర్ఘాయుష్షును ప్రసాదించాలని కోరుకుంటూ రక్షాబంధనం గావించి, స్వీట్లు తినిపించి ఆత్మీయతను పంచారు. పలు చోట్ల కులమతాల కతీతంగా ముస్లిం సోదరులకు రాఖీలు కట్టి మతసామరస్యాన్ని చాటారు. రాఖీలను కొనుగోలు చేసేందుకు వచ్చిన మహిళలతో విక్రయ కేంద్రాల వద్ద సందడి నెలకొంది. వివిధ పార్టీల మహిళా నాయకులు ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులకు రక్షాబంధనం చేసి ఆత్మీయతను చాటుకున్నారు.

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి)


మెదక్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు


జహీరాబాద్‌లో ఎమ్మెల్యే మాణిక్‌రావుకు రాఖీ కడుతున్న ఓంశాంతి ప్రతినిధి ఉషా బహెన్‌జీ


మెదక్‌లో మాజీ కౌన్సిలర్ సమీయొద్దీన్‌కు రాఖీ కడుతున్న వెంకట్రావ్‌నగర్ కాలనీ మహిళ


వెల్దుర్తిలో తమ్ముళ్లకు రాఖీలు కడుతున్న అక్కలు


పెద్దశంకరంపేట శిశుమందిర్‌లో స్వయం సేవకుల రక్షాబంధన్


చిలప్‌చెడ్ మండలం జగ్గంపేటలో సోదరులకు రాఖీ కడుతున్న సోదరి

న్యూస్ బాక్స్

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

రేగోడు ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రేగోడు పోలీస్ స్టేషన్‌ను శనివారం మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, క్రైమ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెంట ఎస్ఐ పోచయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మహిళలకు రాఖీలు, చీరలు పంపిణీ


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్

చిన్నశంకరంపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో ఎన్నారై కంజర్ల చంద్రశేఖర్ మహిళలకు రాఖీలు, చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలందించడం ఆనందంగా ఉందన్నారు. వెంట నిద్రబోయిన స్వామి, జాల రాము, శ్రీమాన్, కృష్ణ, లింగం, ప్రసాద్, నాగరాజు, రమేష్ ఉన్నారు.

● **ఐడీఏబొల్లారం:** ఐడీఏబొల్లారంలో సుమారు 500 మంది మహిళా కార్మికులకు శనివారం బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన తల్లి కొత్వాల్ లక్ష్మమ్మ వర్ధంతి సందర్భంగా చీరలు పంపిణీ చేసినట్టు తెలిపారు.

పండగ సాయన్నకు ఘన నివాళి

పటాన్‌చెరు ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు ఐక్యతగా ఉన్నప్పుడే రాజకీయంగా ఎదగవచ్చని ఎండీఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్ పేర్కొన్నారు. శనివారం పటాన్‌చెరు ముదిరాజ్ భవన్‌లో పండగ సాయన్న వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షుడు ఎట్టయ్య, కుమార్, సత్తెయ్య తదితరులు ఉన్నారు.

నారాయణఖేడ్‌లో రేపు మార్కండేయ స్వామికి భస్మహారతి

నారాయణఖేడ్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ పట్టణ శివార్లలోని భక్త మార్కండేయ చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10న భస్మహారతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మలమంచి గురురాజశర్మ, ఆలయ కమిటీ బాధ్యులు శనివారం ప్రకటనలో తెలిపారు. శ్రావణమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకొని సాయంత్రం 6 గంటలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అత్యంత మహిమాన్వితతమైన బ్రహ్మసూత్రం కలిగిన ఏకైక శివలింగం ఈ ఆలయం ప్రత్యేకత అని వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మంత్రులపై అడ్డగోలు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు

● దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకుల ధ్వజం


నర్సాపూర్‌లో ఆవులరాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

నర్సాపూర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పనిచేసే మా మంత్రులు దామోదర్‌రాజనర్సింహా, వివేక్‌తో పాటు ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి అడ్డగోలు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి విమర్శించారు. శనివారం నర్సాపూర్‌లోని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల పేరిట ధర్నా చేసిన బీఆర్ఎస్ నాయకులు రైతుల గురించి మాట్లాడకపోగా తమ నాయకులపై అడ్డగోలు విమర్శలు చేయడమే కాకుండా జిల్లా కలెక్టర్‌పై కూడా స్థాయి మరిచి మాట్లాడటం దుబ్బాక ఎమ్మెల్యే దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఈ వ్యాఖ్యలు ప్రభాకర్‌రెడ్డి స్వతహాగా చేసినట్టు లేవని హరీశ్‌రావుకు తమ నాయకులను విమర్శించే దమ్ము లేక ప్రభాకర్‌రెడ్డిని పావుగా వాడుకున్నట్టు కనిపిస్తుందన్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాజకీయాలకు తావు లేకుండా తన విధులు సక్రమంగా నిర్వహిస్తూ ఎటువంటి వివాదాలకు తావులేకుండా పనిచేస్తుంటే ఆయనను కూడా విమర్శించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదా తాము కూడా స్పందించాల్సి వస్తుందన్నారు. పీఏసీఎస్ చైర్మన్లు రాజుయాదవ్, వెంకట్రామ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మండలపార్టీ అధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షులు ఆంజిగౌడ్, బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, కొల్చారం మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.


మంత్రులను విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదు

పటాన్‌చెరు ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక వెంకటస్వామిలతో పాటు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని విమర్శించే స్థాయి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి లేదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి ధ్వజమెత్తారు. శనివారం పటాన్‌చెరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడానికి దామోదర రాజనర్సింహ సోనియాగాంధీ వద్ద పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చి ఒప్పించగలిగారని తెలిపారు. అలానే వివేక్‌వెంకటస్వామి అన్ని వర్గాల వారిని కలుపుకుపోయేటట్టు పని చేస్తున్నారన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, అతిక్, హనుమంతు తదితరులు ఉన్నారు.

సంపు నుంచి పొంగుతున్న నీటితో ఇక్కట్లు


శివ్వంపేటలో పొంగిపొర్లుతున్న నీటిలో నుంచే ఇబ్బందులు పడుతూ వెళ్తున్న గూడూరు గ్రామస్థులు

శివ్వంపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పైప్ లైన్ సంపులో నుంచి నీళ్లు పొంగిపొర్లుతూ రోడ్డుపై పారడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శివ్వంపేట మండలకేంద్రంలో జాతీయ రహదారికి సమీపంలో పైప్‌లైన్ సంపు సమీపంలో శుక్రవారం సాయంత్రం నుంచి భారీగా నీళ్లు పొంగిపొర్లుతూ గూడూరుకు రోడ్డుపై నుంచి వెళ్తుండడంతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై మిషన్ భగీరథ ఏఈ రాజకుమారుడును సంప్రదించగా వృథాగా ఉన్న ఆ పైపులతో భగీరథకు సంబంధం లేదని పొలాల్లో నుంచి వర్షపు నీరు పైపులకు చేరి సంపు దగ్గర పొంగుతున్నాయని తెలిపారు. వర్షాలు కురిసినపుడు పైప్ లైన్‌లో నుంచి వచ్చిన నీరు నివాసాల మధ్యలోకి చేరి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


సికింద్లాపూర్ రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపునీరు

రోడ్డుపై గుంతలతో ప్రయాణికులకు తప్పని తిప్పలు

శివ్వంపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయంతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే రహదారి గుంతలమయమై అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులకు పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం వానాకాలం కావడంతో ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. మండల పరిధిలోని గోమారం సికింద్లాపూర్‌కు వెళ్లే రహదారి నుంచి లక్ష్మీనృసింహస్వామి ఆలయంతో పాటు సంగారెడ్డి జిల్లా కానుకుంట, మీదిగా మేడ్చల్ జిల్లా ఇతర ప్రాంతాలకు పరిశ్రమంలో పనిచేయడానికి ఆటోలో నిత్యం వందలాది మంది ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తారు. ఈ రోడ్డుపై బీటీ పూర్తిగా తొలగిపోయి భారీ గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడం గమనార్హం ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపైన ఏర్పడిన బారి గుంతలను పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ నెల 13వ తేదీ లోగా రైతు బీమా కోసం నమోదు చేసుకోవాలి

నారాయణఖేడ్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): భూ భారతి పోర్టల్‌లో గత జూన్ 5 నాటికి డిజిటల్ సైన్ చేసిన పట్టాదారుల వివరాలు, కమీషనర్ ట్రైబల్ వెల్ఫేర్ నుంచి అందిన ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాహోల్డర్ల వివరాల ఆధారంగా పాత, కొత్త, అర్హులైన రైతుల బీమా పునరుద్ధరణ, నమోదు జరుగుతుందని స్థానిక ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నమోదుకు ఈనెల 13 చివరి గడువు అన్నారు. 1966 ఆగస్టు 8 నుంచి 2007 ఆగస్టు 14 మధ్య పుట్టిన 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల రైతులు రైతు బీమాకు అర్హులన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూమి పట్టా పాసు పుస్తకం, నామినీ ఆధార్ కార్డు, బీమా ఎన్‌రోల్ మెంట్ ఫామ్‌తో రైతు సంతకం చేయాల్సి ఉన్నందున రైతు విధిగా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్దకు నమోదు చేయించుకోవాలని సూచించారు.

దుబ్బాక ఎమ్మెల్యే పై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి


నార్సింగిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి బాబు, నాయకులు

చేగుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై దుబ్బాక కాంగ్రెస్‌పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని నార్సింగ్ బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కుమ్మరి బాబు, నాయకులు హితవు పలికారు. శనివారం నార్సింగిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో పోటీ చేసి డిపాజిట్ కూడా దక్కించుకోని చెరుకు శ్రీనివాస్ రెడ్డి, రెండుసార్లు మెదక్ ఎంపీగా, దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్టు విమర్శలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. జిల్లాలో ఇన్‌చార్జి మంత్రులు ఉన్నా దుబ్బాకకు ఒరగ బెట్టిందేమీ లేదని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ఇలాంటి మాటలు మానుకోవాలని వారు హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్‌పక్ష మండల ప్రధాన కార్యదర్శి భూపతి రాజ్, నర్సంపల్లి గ్రామ అధ్యక్షుడు భాష నాయక్, నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలి: డీఎం

నారాయణఖేడ్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ అధికారులు, సిబ్బందికి పరమావధి కావాలని స్థానిక ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. శనివారం ఖేడ్ పట్టణంలోని రాజీవ్ చౌక్ సమీపంలో బస్ స్టాప్ వద్ద ఆర్టీసీ పర్యవేక్షణ కమిటీ పని తీరును పర్యవేక్షించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా బస్సుల్లో విపరీతమైన రద్దీ నెలకొనడంతో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి భోజనాల ప్యాకెట్లు, డబుల్‌డ్యూటీ చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు వెజ్ బిర్యాని ప్యాకెట్లను అందజేశారు. వెంట అసిస్టెంట్ డీఎం నర్సింహులు, మార్కెటింగ్ సేల్ ఇన్‌చార్జి పాండు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పద్మశాలీల ఆధ్వర్యంలో యజ్ఞోపవీత ధారణ


ఖేడ్‌లోని భక్తమార్కండేయ ఆలయంలో యజ్ఞోపవీతధారణ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం సభ్యులు

నారాయణఖేడ్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణ శివార్లలోని భక్తమార్కండేయ స్వామి ఆలయంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం నూలుపౌర్ణమిని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పురోహితులు వెంకటేష్ పంతులు ఆలయంలో గాయత్రీదేవి, గణపతిపూజ, చంద్రమౌళీశ్వరుడికి మహాభిషేకం, మహా హారతి నిర్వహించిన అనంతరం పద్మశాలీలు సంప్రదాయపూర్వకంగా యజ్ఞోపవీత ధారణ చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం బాధ్యులు, సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

● **పటాన్‌చెరు:** రామచంద్రాపురంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం సంఘం అధ్యక్షుడు తడక నాగభూషణం ఆధ్వర్యంలో మార్కండేయ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. అనంతరం యజ్ఞోపవీత ధారణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

● **పెద్దశంకరంపేట:** పెద్దశంకరంపేట పట్టణంలో పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మార్కండేయ ఆలయంలో శనివారం యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మార్కండేయ ఆలయంలో శివలింగానికి, మార్కండేయ విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, పద్మశాలీ సంఘం బాధ్యులు, తదితరులు ఉన్నారు.

కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు

పటాన్‌చెరు ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధి కృషి డిఫెన్స్‌కాలనీలో ఓపెన్‌జిమ్ ఏర్పాటుపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వపరంగా తగిన సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు.

వైద్య విద్యార్థులకు అండగా మంత్రి దామోదర్

పుల్‌కల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య, ఆరోగ్య, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ వైద్య విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేశారు. చౌటకూర్ మండలం హన్మాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ దళిత ఉద్యమ నాయకుడు నాగిరెడ్డిపల్లి కృష్ణంరాజు అనారోగ్యానికి గురై జూలై 13న మృతి చెందారు. ఈ మేరకు మంత్రి దామోదర రాజనరసింహ, యువజన కాంగ్రెస్ నాయకురాలు త్రిషతో కలిసి 31వ తేదీన హన్మాపూర్ గ్రామానికి వెళ్లి కృష్ణంరాజు కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మృతుడి కుమారులు లెనిన్‌రాజ్, స్టాలిన్‌రాజ్‌లు హైదరాబాద్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. వారి ఉన్నత చదువుల నిమిత్తం శుక్రవారం రూ.1.50లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. భవిష్యత్తులో అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు.

పండగ పూట.. మున్సిపల్ సేవలు


తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న మెదక్ మున్సిపల్ కమిషనర్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఓ వైపు వర్షాలు కురుస్తుండగా.. మరో వైపు ప్రభుత్వలక్ష్యాన్ని నెరవేర్చేందుకు 100 రోజుల కార్యక్రమాన్ని నిర్వహించిన మెదక్ మున్సిపల్ అధికారులు నిబద్ధతను చాటుకున్నారు. శనివారం రాఖీ పౌర్ణమి పండగ రోజూ మున్సిపల్ అధికారులు విధుల్లో పాల్గొన్నారు. సీడీఎంఏ ఆదేశాల మేరకు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి విధులకు హాజరై సేవలందించారు. వర్షాలు పడుతుండటంతో కాలనీలలో సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి పారిశుధ్య సేవలు అందించారు. అనంతరం కాలనీలలో వార్డు అధికారులతో కలిసి తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు.

గిరిజన గురుకులంలో ఘనంగా ఆదివాసి దివస్


బాచేపల్లి గిరిజన గురుకుల పాఠశాలలో ఆదివాసి దివస్ వేడుకలు

కల్హేర్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గిరిజన బాలికల మినీ గురుకుల పాఠశాలలో శనివారం అంతర్జాతీయ ఆది వాసి దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గురుకులంలోని విద్యార్థులకు వ్యాసరచన, రంగోళి, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు ఆహూతులను అలరించాయి. సిబ్బంది, విద్యార్థులు గిరిజనుల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహారాజ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసిల చరిత్ర, జీవన విధానం గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత విద్యార్థులకు వివరించారు.

జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాలలో..

జిన్నారం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. శనివారం జిన్నారం ఎస్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, సాంస్కృతిక, చిత్ర లేఖనం, రంగోలి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆదివాసి దినోత్సవ ప్రత్యేకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలియజేశారు. పలువురు విద్యార్థులు ఆదివాసుల జీవన శైలిపై రంగోలి, చిత్రలేఖనంతో అందమైన బొమ్మలను వేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డిప్యూటీ వార్డెన్ కమలాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ సంఘంగా మారిన కేంద్ర ఎన్నికల కమిషన్


సంగారెడ్డిలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ బీజేపీ సంఘంగా మారిపోయిందని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ విమర్శించారు. శనివారం సంగారెడ్డిలో సీపీఎం నాయకులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిహార్‌లో బీజేపీని గెలిపించేందుకు 60 లక్షల ఓట్లను కేంద్ర ఎన్నికల కమిషన్ తొలగించడం విడ్డూరంగా ఉందన్నారు. త్వరలో జరగబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసినా మోదీకి అక్కడ అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి పెంచి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ప్రజల ఓట్లను తొలగించారన్నారు. ఎన్నికల కమిషన్ బీజేపి కమిషన్ మాదిరిగా కాకుండా, దేశ ప్రజల కమిషన్‌గా ఉండాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ. సాయిలు, నాయకులు యాదగిరి, కృష్ణ, అశోక్, శివకుమార్, మల్లేశ్, శ్రీనివాస్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి కన్నుమూత


చందాపురం శ్రీనివాస్ (ఫైల్)

పుల్‌కల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం కోర్పోలు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చందాపురం శ్రీనివాస్‌ముదిరాజ్ (55) గుండెపోటుతో కన్నుమూశారు. 15 రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకున్నారు. ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి ఛాతిలో నొప్పి రావడంతో అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులున్నారు. అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్ నియోజకవర్గ అగ్రనేత పట్లోళ్ల జైపాల్‌రెడ్డితో కలిసి మృతుడు శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని తెలిపారు. కోర్పోలులో శనివారం నిర్వహించిన అంత్యక్రియలకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చౌకంపల్లి శివకుమార్, నాయకులు తదితరులు హాజరయ్యారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి: సీపీఎం


చిత్తడిగా మారిన సీసీ రోడ్డు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నారాయణఖేడ్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే బురద మయంగా మారే రహదారులు, వర్షపు నీటితో చెరువులా తయారయ్యే రాజీవ్ చౌక్ ప్రాంతంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఎం ఖేడ్ డివిజన్ కార్యదర్శి ఎస్.రమేష్ ఆరోపించారు. ఖేడ్ పట్టణంలోని వివిధ కాలనీల్లో శనివారం పర్యటించి, చిత్తడిగా మారిన రహదారి వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీవ్ చౌక్ ప్రాంతంతో పాటు ప్రధాన రహదారిన శాశ్వతంగా బీటీతో మరమ్మతులు చేయకుండా కంకర వేసి గోతులు పూడ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. సేవాలాల్ నుంచి గాంధీ విగ్రహం వరకు బైపాస్ కు నిధులు మంజూరు అయ్యాయని చెప్పడం తప్ప మరమ్మతులు చేయడం లేదన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించని పక్షంలో ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొటారి నర్సింలు, గణపతి, మహిపాల్, విజయ్, రఘు, తదితరులు ఉన్నారు.